క్లుప్తంగా...

నేడు ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్ కుమారస్వామి తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే శిబిరంలో బీపీ, షుగర్, కంటి, చెవి, ముక్కు, థైరాయిడ్, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు తదితర సమస్యలకు వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం..



ప్లాస్టిక్ బాటిళ్లు సేకరిస్తున్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలనే సంకల్పంతో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు, అధ్యాపకులు శుక్రవారం ఉదయం కళాశాల గేటు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల వద్ద ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించి వారికి స్టీల్ బాటిళ్లను అందజేశారు. ప్లాస్టిక్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కో ఆర్డినేటర్ పవన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి నిఖిల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తె మెట్టెలు అందజేత



పుస్తె మెట్టెలు అందజేస్తున్న నాయకులు

మేడ్చల్: మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో పేదింటి యువతి వివాహానికి నాయకులు పుస్తె మెట్టెలు అందజేశారు. గ్రామానికి చెందిన కమ్మరి లక్ష్మీ కూతురు సంతోషి వివాహానికి జెడ్పీటీసీ దంపతులు శైలజా విజయానందరెడ్డి పుస్తె మట్టెలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రకాష్, సీనియర్ నాయకుడు సంజీవరెడ్డి, ఉపసర్పంచ్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

'సెయింట్ పీటర్స్'లో రక్తదాన శిబిరం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శుక్రవారం రక్తదానం చేశారు. మహావీర్ ఇంటర్నేషనల్ అండ్ తలసేమియా సెల్ సొసైటీ వారు కళాశాల ఎన్ఎస్ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, డైరెక్టర్ సరోజరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత ప్రారంభించగా అనంతరం విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ రాజేశ్, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్



మేడ్చల్: డబుల్ బెడ్‌రూం అంశంపై బీజేపీ తలపెట్టిన కలెక్టరేట్ ఎదుట ధర్నాలకు నాయకులు తరలివెళ్లకుండా మేడ్చల్ బీజేపీ నాయకులను పోలీసులు శుక్రవారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేశారు. మేడ్చల్ మండల, మున్సిపాలిటీల నాయకులను మేడ్చల్ పోలీసులు ఉదయాన్నే అరెస్ట్ చేసి ఠాణాలకు తరలించి ఆ తర్వాత విడుదల చేశారు. అరెస్టయిన వారిలో నాయకులు ఆంజనేయులు, జాకట ప్రేందాస్, శ్రీనివాస్‌గౌడ్, వంశీవంజరి, రాఘవరెడ్డి, ముత్యాల గాంధీ, నాగరాజు తదితరులు ఉన్నారు.

రుణమాఫీ చెక్కుల పంపిణీ



శామీర్‌పేట్: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే సీఎం కేసీఆర్ రైతు రుణమాఫీ చేశారని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జగన్‌గూడ గ్రామానికి చెందిన పలువురు రైతులకు శుక్రవారం రైతు రుణమాఫీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అటెవరు.. ఇటెవరు..?

- ▲ బీఆర్ఎస్ నుంచి మంత్రి మల్లారెడ్డి
- ▲ బీజేపీ, కాంగ్రెస్ నుంచి ఎవరని చర్చ
- ▲ బలమైన నాయకుల కోసం వేట

మేడ్చల్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నుంచి పోటీ చేసే ప్రధాన పార్టీల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మంత్రి మల్లారెడ్డి పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో బీజేపీ, కాంగ్రెస్‌లలో అభ్యర్థులు ఎవరనే ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది. సీఎం కేసీఆర్ 115 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించి నోటిఫికేషన్ రాకముందే రాష్ట్రంలో ఎన్నికల వేడిని సృష్టించడంతో మల్లారెడ్డిని ఢీ కొట్టే నాయకులు ఎవరనే అంశంపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. మంత్రి మల్లారెడ్డి ఎలాంటి అసమ్మతి లేకుండా బీఆర్ఎస్ దూసుకుపోతుండగా కాంగ్రెస్, బీజేపీ నాయకుల్లో ఎవరూ ఎమ్మెల్యే అభ్యర్థి అర్థం కావడం లేదు.

కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట..

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మూడు ముక్కలాటగా ఉంది. పార్టీలో సమర్థ నాయకులు, సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన నాయకులు ఉన్నా వారు ఎవరికివారే ఉంటూ ఏకాభిప్రాయంతో లేకపోవడంతో ఆ పార్టీలో అభ్యర్థి తేలడం అంత సులువుగా కనిపించడం లేదు. పీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర జంగయ్య(వజ్రేష్) యాదవ్‌లు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. హరివర్ధన్‌రెడ్డి 1999లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయారు. జంగయ్య ఒకసారి ప్రజారాజ్యం, మరోసారి టీడీపీ తరఫున పోటీచేసి ఓటమి చెందారు. ఇద్దరూ సీనియర్ నేతలే. నియోజకవర్గంలో తమకంటూ ప్రత్యేక పలుకుబడి వర్గాలు ఏర్పాటు చేసుకుని ఆర్థిక బలం అన్ని సమకూర్చుకొని ఈసారి ఎన్నికల బరిలో దిగేందుకు తమ వద్ద ఉన్న అన్ని అస్త్రాలను ఉపయోగిస్తున్నారు. ప్రముఖ జర్నలిస్ట్ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ మేడ్చల్ నుంచి పోటీ చేస్తానని పలుమార్లు ప్రకటించగా ఆయనను కాంగ్రెస్ నుంచి మేడ్చల్‌లో బరిలో ఉంచాలని కాంగ్రెస్ అధిష్టానం ఆలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. అతడు సీన్‌లోకి వస్తే తమ సీటు ఎక్కడ పోతుందోననే భయంలో ఇద్దరు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

మరింత బలమైన నాయకుడి కోసం..

బీజేపీ అభ్యర్థి ఎన్నికల నాటికి తేలేలా కనిపించడం లేదు. ఆ పార్టీకి మేడ్చల్ నుంచి పోటీ చేయడానికి గతంలో చాలాసార్లు ఓడిపోయిన పెద్ది మోహన్‌రెడ్డి(కొంపల్లి), జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రంరెడ్డిల పేర్లు వినిపిస్తున్నా అధిష్టానం మరింత బలమైన నాయకుడి కోసం వెతుకుతున్నట్లు సమాచారం. అన్ని పార్టీల్లో టికెట్లు ప్రకటించాక టికెట్ కోసం ఆశించి భంగపడ్డ నాయకులు తమ పార్టీలోకి పారాచ్యూట్ వేసుకుని వస్తారని బలమైన నాయకులతో ఎన్నికల రంగంలోకి దిగవచ్చని ఆ పార్టీ నాయకులు వ్యూహ రచనలు చేస్తున్నారు. అధికార పక్షం అభ్యర్థిగా మల్లారెడ్డి ఉండటంతో ఈ సారి ఎన్నికలు జోరుగా సాగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. గత ఎన్నికల్లో మల్లారెడ్డి తన పూర్తి బలగాన్ని దించారు. బలమైన మల్లారెడ్డిని ఎన్నికల కదనరంగంలో ఢీకొట్టేందుకు ప్రతిపక్షాలు ఎలాంటి అభ్యర్థులను రంగంలోకి దించుతారో చూడాల్సిందే.

మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న మల్లేష్‌గౌడ్



గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న మల్లేష్‌గౌడ్

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ కోసం అత్వెల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రోయ్యపల్లి మల్లేష్‌గౌడ్ శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన తన అనుచరులతో కలిసి గాంధీ భవన్‌కు వెళ్లి పార్టీ నిర్ణయించిన రుసుం చెల్లించి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట అనుచరులు మాజీ సర్పంచ్ యాదగిరి, మనోహర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ కళాశాలలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మేడ్చల్: కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాలల యాజమాన్యం తమ కళాశాలల నుంచి వస్తున్న మురికి నీరు సుతారిగూడ చెరువులో కలుపుతున్నారని కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కళాశాల నుంచి వస్తున్న డ్రైనేజీ వాటర్‌ను శుద్ధి చేయడానికి ఎలాంటి ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు చేసుకోకుండా మొత్తం మురుగు నీటిని సుతారిగూడ చెరువులోకి వదిలేస్తున్నారని అన్నారు. దీంతో చెరువు నీరు కలుషితమై అందులో చేపలు చనిపోతున్నాయని, చెరువు దుర్గంధంగా మారిందని అన్నారు. పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను తప్పకుండా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు ఎంతో విలువైనదని మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులతో పాటు అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే యువత ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి జిల్లావ్యాప్తంగా బూత్ లెవల్ అధికారి(బీఎల్వో)లతో ఈ నెల 26, 27 తేదీలతో పాటు సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారి పేర్లను ఓటర్లుగా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 1950 ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

కలెక్టరేట్ ముట్టడికి బీజేపీ నేతల యత్నం

సాక్షి, మేడ్చల్ జిల్లా: భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు కలెక్టరేట్ ముట్టడికి మేడ్చల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను శుక్రవారం పోలీసులు ఎక్కడికి అక్కడే అడ్డుకున్నారు. పలువురి నేతలను అరెస్టు చేసి, వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. అర్హులైన పేదలకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరుతూ బీజేపీ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ఆందోళనలో భాగంగా శుక్రవారం ఉదయం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షుడు, రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన పేద ప్రజలకు డబుల్ బెడ్ ఇళ్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి రాగా, మార్గం మధ్యలోనే పోలీసులు అడ్డుకున్నారు. బీజేపీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ మురళీధర్ రావును కూడా అడ్డుకున్నారు. రూరల్ జిల్లా అధ్యక్షుడు పి.విక్రంరెడ్డిని అల్వాల్‌లో అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేత మురళీధర్ రావు మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ బాధితులుతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకొని లాఠీచార్జి చేసి, అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందని విమర్శించారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో నిష్ణాతులవ్వాలి



ఘట్‌కేసర్ : కరోనా పాండమిక్ అనంతరం డిజిటల్ విప్లవం మొదలైందని, విప్లవాత్మక మార్పుతో పాటు సైబర్ నేరాలు కూడా పెరిగాయని ఇండియా ఈసీ కౌన్సిల్ సీనియర్ డైరెక్టర్ పూజ్యజోషి అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం, సీఎస్ఐ, ఈసీ కౌన్సిల్ సంయుక్తంగా విద్యార్థులకు నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నేరాలకు అనుగుణంగా సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో విద్యార్థులు నిష్ణాతులైతే తప్ప నేరాలను అరికట్టలేమన్నారు. ఎథికల్ హ్యాకింగ్, నెట్‌వర్క్ డిఫెండర్, సైబర్ ఫోరెన్సిక్ వంటి కోర్సులు చేయడం ద్వారా విద్యార్థుల ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. డీన్‌లు విజయకుమార్, విష్ణుమూర్తి, సమన్వయకర్తలు శివప్రశాంత్, రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'డబుల్' పారదర్శకత!

- అర్హులైన పేదలకు డబుల్ ఇళ్ల కేటాయింపు
- టాంపర్ ఫ్రీ సాఫ్ట్‌వేర్‌తో అర్హుల ఎంపిక
- ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లిలో 2వేల మంది ఎంపిక
- కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో నిరుపేదలకు సొంతింటి కల సాకారమవుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఇళ్లు లేని పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న సదుద్దేశ్యంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించి, వాటిని ఎంతో పారదర్శకంగా కేటాయిస్తోందని, ఎలాంటి పైరవీలు, జోక్యం లేకుండా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, సంబంధిత జిల్లా శాఖల అధికారులు, మీడియా సమక్షంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపును ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్ డ్రా నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లి, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి 500 మంది లబ్ధిదారుల చొప్పున నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2 వేల మంది అర్హులైన లబ్ధిదారులను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ (టాంపర్ ఫ్రీ) ద్వారా ఎంపిక చేసి, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 1,75,959 దరఖాస్తులు వచ్చాయని శుక్రవారం వరకు అర్హత కలిగిన లబ్ధిదారులు 24,717 మంది ఉన్నారని తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుంచి మొదటి విడతగా 500 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి ఇళ్ల కేటాయించడం జరిగిందన్నారు. ఇలాంటి ప్రక్రియ దేశంలోనే మొదటిసారిగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియతో అర్హులైన పేదలందరికీ ఇళ్ల కేటాయింపు జరిగేంత వరకు నిరంతరం కొనసాగుతుందని మంత్రి వివరించారు.

ఇళ్ల కేటాయింపులో పారదర్శకత: కలెక్టర్ అమయ్‌కుమార్

జిల్లావ్యాప్తంగా అర్హులైన నిరుపేదల సొంతింటి కల సాకారం చేసే విధానంలో భాగంగా పారదర్శకంగా, జవాబుదారి తనంతో వ్యవహరించామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. జాతీయ సమాచార కేంద్రం(ఎన్ఐసీ) వారి సహకారంతో తారుమారు చేయకుండా ఉండేలా(టాంపర్ ఫ్రీ) సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రజాప్రతినిధుల సమక్షంలో అర్హులైన వారికి ఇళ్లను కేటాయించామన్నారు. కేటాయింపుల విషయంలో ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేదన్నారు. అలాగే తక్కువ సమయంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక జరిగేలా సాఫ్ట్‌వేర్ డెవలప్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఒకసారి ఎంపికైన లబ్ధిదారుడు మళ్లీ ఎంపిక కాకుండా ఉండేందుకు ఆధార్ నంబర్ ప్రాతిపదికన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించామని పేర్కొన్నారు. ఈ విధానంతో సమయం, తేదీ కూడా సాఫ్ట్‌వేర్‌లో నమోదవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పి.రవీందర్, రోడ్లు భవనాల శాఖ అధికారి శ్రీనివాసమూర్తి, సీపీవో మోహన్‌రావు, ఆర్డీవోలు రాజేష్‌కుమార్, శ్యామ్‌ప్రకాశ్, డిప్యూటీ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాఘవేందర్‌కు డాక్టరేట్



కీసర: కీసర మండలం సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న జె.రాఘవేందర్ గణితంలో డాక్టరేట్ అందుకున్నారు. వనపర్తిజిల్లా జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యను అభ్యసించి ఆయన హైదరాబాద్‌లో ఎమ్మెస్సీ గణిత శాస్త్రం అభ్యసించారు. తల్లిదండ్రులు స్నేహితులు ప్రోత్సాహంతో రాయలసీమ విశ్వవిద్యాలయం నుంచి గణితంలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. 20 ఏళ్ల బోధనా అనుభవం కలిగిన అతను అసోసియేట్ ప్రొఫెసర్, హెచ్ఓడీ, ఎగ్జామినేషన్ కంట్రోలర్‌గా పనిచేశారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి



జవహర్‌నగర్: యాదవులు అన్నిరంగాల్లో రాణించాలని జవహర్‌నగర్ యాదవ సంఘం నాయకులు అన్నారు. యాదవుల విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నాగోల్‌లో నిర్వహించిన యాదవ యుద్ధభేరికి శుక్రవారం జవహర్‌నగర్ నుంచి యాదవ సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ.. యాదవులు రాజకీయంగా రాణించాలని, రాజకీయంగా దక్కాల్సిన ఫలాలు అందాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మేక లలితాయాదవ్, నాయకులు కాయిత రాజుయాదవ్, నర్సింహయాదవ్, నర్సింహాయాదవ్, సిద్దులుయాదవ్, అశోక్‌యాదవ్, నవీన్‌యాదవ్, కృష్ణయాదవ్, యాదగిరియాదవ్ తదితరులు ఉన్నారు.

మేడ్చల్‌లో పోటీకి కేఎల్ఆర్ నో..

మేడ్చల్: మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కేఎల్ఆర్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఈ సారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు మేడ్చల్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోలేదు. మేడ్చల్‌కు నాయకుడిగా ఉన్న ఆయన గత రెండు పర్యాయాలుగా మేడ్చల్‌లో ఓటమి చెందడంతో ఈ సారి నియోజకవర్గం మార్పు చేయాలనే ఉద్దేశ్యంతో మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోలేదు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్, వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గాల కాంగ్రెస్ టికెట్ కోసం గాంధీభవన్‌లో ఆయన దరఖాస్తు చేసుకున్నారు.

మేడ్చల్‌లో ముగ్గురు..

మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ కోసం పోటీ పడుతున్న మేడ్చల్ నాయకులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, తోటకూర వజ్రేష్ యాదవ్ దరఖాస్తు చేసుకున్నారు. మేడ్చల్‌కు చెందిన వ్యాపారవేత్త, సీనియర్ నాయకుడు ఏవీ సత్యనారాయణ దరఖాస్తు చేసుకున్నారు. మరి కొంత మంది నాయకులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

రానున్న ఎన్నికల్లో తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్

- మేడ్చల్‌లో బీఆర్ఎస్ ఓడించేందుకు ప్రజలు సిద్ధం
- మహారాష్ట్రలోని జింటూర్ ఎమ్మెల్యే మేఘనా దీపక్ సాకోర్ బోర్డికర్



సాక్షి, మేడ్చల్ జిల్లా: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానమంత్రి మోదీ అండతో తెలంగాణ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడుతుందని మహారాష్ట్రలోని జింటూర్ బీజేపీ ఎమ్మెల్యే మేఘనా దీపక్ సాకోర్ బోర్డికర్ జోస్యం చెప్పారు. ఈ నెల 20 నుంచి శుక్రవారం వరకు మేడ్చల్ నియోజకవర్గంలోని పలు పురపాలక సంఘాలు, గ్రామాల్లో పర్యటించి, అన్నీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం పీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ద్వాక్రా మహిళలు, రైతులు, దివ్యాంగులతో మాట్లాడినట్లు తెలిపారు. జవహర్ నగర్‌లో విశ్రాంత ఆర్మీ ఉద్యోగులతో మాట్లాడానన్నారు. రేషన్ షాపులను కూడా సందర్శించి, బియ్యం సరఫరా ఎలా జరుగుతుందన్న విషయాలను అడిగి తెలుసుకున్నారన్నారు. వారం రోజుల నుంచి శామీర్‌పేట, కీసర, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, దమ్మాయిగూడ, నాగారం, మేడ్చల్ ప్రాంతాల్లో పర్యటించి బీజేపీ బూత్ అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌చార్జులు, జిల్లా పదాధికారులు, రాష్ట్ర నాయకులతో సమావేశాలు నిర్వహించి బీజేపీ పనితీరును పర్యవేక్షించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అవినీతి, నియంతృత్వం, కుటుంబ పాలన రాజ్యమేలుతోందని, కుటుంబ పాలనను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కేసీఆర్ ప్రజావ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ఓటు వేయడానికి మేడ్చల్ నియోజకవర్గం ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మేడ్చల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి భూకబ్జాలకు పాల్పడుతున్నట్లు ప్రజలు వివరించారన్నారు. అవినీతి, అక్రమాలు, భూకబ్జాలకు మంత్రి కేరాఫ్ అడ్రస్‌గా మారాడని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి రెండు లక్షల పైచిలుకు ఇళ్లను కేటాయిస్తే ఇప్పటి వరకు వేల సంఖ్యలో కూడా ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. ప్రతి పనిలో కమిషన్లు లేనిదే పనిచేయడం లేదన్నారు. మహారాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ ఉమేష్ దేశ్ ముఖ్, మహారాష్ట్ర బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ బూమ్రే, మేడ్చల్ రూరల్ జిల్లా ఇన్‌చార్జ్ వేముల నరేందర్, రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు జిల్లాల తిరుమలరెడ్డి, విజయ్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బండారు పవన్ రెడ్డి, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు అనిల్ రెడ్డి, నాయకులు రాసాల నర్సింగ్‌రావు, తలారి రవియాదవ్, ప్రగతి, ఏనుగుల లక్ష్మయ్య వెంకటేష్ యాదవ్, జైకిషన్, బోడుప్పల్ కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి, వివిధ మోర్చల నాయకులు పాల్గొన్నారు.

సొంత నిధులతో సీసీ రోడ్డు పనులు



కీసర: సొంత నిధులతో గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్న మంత్రి మల్లారెడ్డిని ఈసారి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్ఎస్ కీసర మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, కీసర సర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్ అన్నారు. శుక్రవారం కీసర శివాజీనగర్‌కాలనీలోని పోచమ్మదేవాలయం చుట్టూ చేపట్టిన సీసీరోడ్డు పనులను వారు ప్రారంభించారు. వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తటాకం నారాయణ, ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, కీసరగుట్ట ట్రస్టుబోర్డు సభ్యుడు శీలం శ్రీనివాస్, కీసర మాజీ ఎంపీటీసీ సభ్యులు బెలిదే రమేష్ గుప్తా, జంగయ్యయాదవ్, మాజీ ఉపసర్పంచ శ్రావన్‌కుమార్‌గుప్తా, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.